ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- జనావాసాల మధ్య, రోడ్ల వెంబడి ఏర్పాటు
- ఫెన్సింగ్ లేకపోవడంతో ఆందోళనలో ప్రజలు
- విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్న మూగజీవాలు

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి, ఎరసానిగూడెం, కట్టంగూర్, అయిటిపాముల, పందెనపల్లి, ఈదులూరు, చెర్వుఅన్నారం, మునుకుంట్ల, అయిటిపాములతోపాటు పలు గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. కట్టంగూర్ మండల కేంద్రంలోని కల్మెర రోడ్డు వెంబడి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో, ఆంజనేయస్వామి ఆలయం వద్ద, మునుకుంట్ల గ్రామ పంచాయతీ సమీపంలో కృష్ణా జలాల ట్యాంకు వద్ద, కట్టంగూర్ 3వ వార్డులో పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్నాయి.

భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

కట్టంగూర్ మండల కేంద్రంలోని ఈదులూరు రోడ్డు వెంట ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అదే దారిలో మీ సేవ కేంద్రం, వైన్స్ షాపు ఉండడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనదారులకు సరియైన పార్కింగ్ లేకపోవడంతో రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై అడ్డంగా వాహనాలు ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే దారిలో పక్కనే ఉన్న వీధిగుండా నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు విద్యుదాఘాతనికి గురై మృత్యువాత పడుతున్నాయి. కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం గ్రామంలో బస్‌స్టాప్ వద్ద మంచినీటి ట్యాంకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కట్టంగూర్ హైస్కూల్ ప్రహరీ వెంబడి ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్



బొల్లేపల్లిలో రామాలయం గుడి సమీపంలో రోడ్డు పక్కనే ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



కట్టంగూర్ మండల కేంద్రంలోని ఈదులూరు రోడ్డు వెంబడి, కురుమర్తి రోడ్డు, హైస్కూల్ వద్ద, అంబేద్కర్ నగర్‌లో, ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

– చెరుకు శ్రీనివాస్, కట్టంగూర్

క్లుప్తంగా

దివ్యాంగుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.కరుణాకర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం ఉపాధ్యాయుడు బోయ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీదేవి, ఆవుల గీత, వరలక్ష్మి, సరిత, సీఆర్‌పీలు జాన్, ప్రవళ్లిక తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి నియామకంపై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

శాలిగౌరారం: సీఎంగా రేవంత్‌రెడ్డి నియామకంపై మంగళవారం రాత్రి శాలిగౌరారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చింత ధనుంజయ్య, వడ్లకొండ పరమేశ్, నిమ్మల వీరస్వామి, బొల్లికొండ గణేశ్, సందీప్, కుంభం వేణు, చిల్లంశెట్టి సాయిగణేశ్, గుడె సతీష్, కోనేటి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించిన ఊట్కూరు వాసి



శీలం వంశీ

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన శీలం వంశీ అనే యువకుడు కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని సాధించాడు. మంగళవారం వెలువడిన 'ఎస్సెస్సీ సిజిఎల్'(స్టాఫ్ సెలక్షన్ కమిషన్-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్) పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1500 ర్యాంకు సాధించిన వంశీ నేవీ విభాగంలో కస్టమ్స్ ప్రివెంట్ అధికారి(ఇన్‌స్పెక్టర్) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వంశీ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్ అధికారిగా పనిచేస్తున్నాడు. శీలం వంశీ ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకు శాలిగౌరారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసించగా 8 నుంచి 10వ తరగతి వరకు సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో పూర్తిచేశాడు. అదేవిధంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ట్రిపుల్‌ఐటీ పూర్తి చేశాడు. వంశీ తండ్రి శంకర్ గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తుండగా తల్లి అనిత గృహిణి.

అంకితభావంతో పనిచేయాలి

మిర్యాలగూడ టౌన్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళాహనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లం అనంతరెడ్డి తన ఖర్చులతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని ఎంపీపీ 40మంది విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు.

వీఎన్ జీవితం ఆదర్శనీయం

మిర్యాలగూడ అర్బన్: ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన మల్లు వెంకట నరసింహారెడ్డి(వీఎన్) జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మల్లు వెంకట నరసింహారెడ్డి 19వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీఎన్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగదీష్‌చంద్ర, మల్లు గౌతంరెడ్డి, మంగారెడ్డి, రామ్మూర్తి, వాడపల్లి రమేష్, మల్లయ్య, సత్యనారయణరావు, రామారావు, కరీం, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పంచాయతీ కార్యాలయానికి తాళం తీసేదెప్పుడు!



తాళం వేసి ఉన్న ఏమిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

కనగల్ : నిత్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల అవసరాలు తీర్చాల్సిన పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనగల్ మండల పరిధిలోని ఏమిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం నెలలో కనీసం సగం రోజులకు పైగా తాళం వేసి ఉంటోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏదైనా పనికోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా సంబంధిత కార్యదర్శి సక్రమంగా గ్రామానికి వచ్చేవిధంగా చూస్తామన్నారు.

కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదు



పంచాయతీ కార్యదర్శి గ్రామంలో అందుబాటులో ఉండడం లేదు. నెలలో సగం రోజులు కూడా గ్రామానికి రావడం లేదు. పంచాయతీ భవనం ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. రెగ్యులర్‌గా రాకపోతే గ్రామంలో ఉన్న వారందరం సంతకాలు పెట్టి త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– ఏమిరెడ్డి భూపాల్‌రెడ్డి, ఏమిరెడ్డిగూడెం

మొక్కులు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు



మునుగోడు : కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

మునుగోడు: అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. చౌటుప్పల్ మండలంలో గల ఆంథోళ్ మైసమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో బీసం విజయ్, పాలకూరి మహేష్, మునుగోటి సాయి, బెల్లి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి పేరిట ప్రత్యేక పూజలు

కనగల్ : నల్లగొండ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భారీ విజయం సాధించడం పట్ల బుడుమర్లపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో మంగళవారం దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద 130 కొబ్బరి కాయలు కొట్టి ఆయన పేరిట అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కారింగు సైదులు, గౌరవ అధ్యక్షుడు కందుల మారయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, సీతయ్య, మామిడాల వీరేశ్, కారింగు వెంకన్న, గౌతమ్, మధు, నరేష్, సైదులు, పరమేష్ తదితరులున్నారు.



కనగల్ : దర్వేశిపురం ఆలయం వద్ద పూజలు చేస్తున్న కార్యకర్తలు

కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జడల చిన మల్లయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజయానికి కృషి చేసిన నాయకులకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందన సభ, విజయోత్సవ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల్లో పనిచేసిన పలువురు నాయకులను, కార్యకర్తలను పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సమావేశంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, మాజీ జెడ్పీటీసీ శేపూరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, ఏనుగు అంజిరెడ్డి, కోనేటి కృష్ణ, శేపూరి మారయ్య, ఏర్పుల పరమేష్, జిట్ట చంద్రకాంత్, బోడ స్వామి, ఇబ్రహీం, సాగర్ల గోవర్ధన్, ఏళ్ళ మల్లేష్, చెర్కుపల్లి శ్రీశైలం, బొబ్బలి రాంరెడ్డి, కోమటిరెడ్డి అమరేందర్‌రెడ్డి, పాల శివ పాల్గొన్నారు.

కోమటిరెడ్డికి ఉన్నత పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న రేఖల భద్రాద్రి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అత్యున్నత పదవి రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఏఐసీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ రేకల భద్రాద్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో నల్లగొండ నుంచి పోటీచేసిన ఎన్టీఆర్‌ను మించి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెజార్టీ వచ్చిందని పేర్కొన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలోనే ఇంత మెజార్టీ ఇంతవరకు ఎవరికీ రాలేదన్నారు. కోమటిరెడ్డి గెలుపులో క్రిస్టియన్ మైనార్టీల పాత్ర కూడా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మైనార్టీలకు ప్రకటించిన పథకాలను అమలు చేయాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్‌లో క్రిస్టియన్ మైనార్టీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు ఎమ్మెల్సీలతోపాటు కార్పొరేషన్ పదవులను ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు.

ప్రజలు మరోసారి మోసపోయారు



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

చిట్యాల: రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రలోభాలకు ప్రజలు ఆశపడి మరోసారి మోసపోయారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సీపీఎం నకిరేకల్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ సీపీఎం పార్టీ ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల్లో సీపీఎం పార్టీకి మద్దతుగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కామ్రేడ్ మల్లు వెంకటనర్సింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేక అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బొజ్జ చినవెంకులు, అవిశెట్టి శంకరయ్య, ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకటేశ్వర్లు, వంటిపాక వెంకటేశ్వర్లు, మల్లం మహేష్, ఆర్రూరి శ్రీను, జిట్ట సరోజ, జల్లెంల పెంటయ్య పాల్గొన్నారు.

'సోనియా రుణం తీర్చుకున్న తెలంగాణ ప్రజలు'

కేతేపల్లి : తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి తీర్చుకున్నారని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆందోళనలో పత్తి, వరి రైతులు



కొంపల్లిలో చేనుపై తడిసిపోయిన పత్తి

మునుగోడు: తుపానుతో మునుగోడు మండలంలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్‌లో వరి పంట సాగు చేసిన రైతులు తమ ధాన్యం అమ్ముకునేందుకు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోసుకున్నారు. మునుగోడు మండలంలో మొత్తం 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా అందులో 8 కేంద్రాల్లోని ధాన్యాన్ని అధికారులు పూర్తిగా కొనుగోలు చేశారు. కొరటికల్, ఊకొండి, సింగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇంకా 20 మంది రైతులు ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో ఆ రైతులు తమ ధాన్యం వర్షానికి తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వీరితోపాటు కొందరు రైతులు పత్తి పంటకు నీరు పారించడంతో నేటికీ దిగుబడి వస్తోంది. అలా మండలవ్యాప్తంగా దాదాపు 15 వేల ఎకరాల్లో పత్తిని కూలీలతో ఏరించకుండా ఉండడంతో ఆ పత్తి ముసురుకు తడిసిపోతోంది. తుపాన్ కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం !

- అనుమతి ఇవ్వలేదంటున్న మున్సిపల్ కమిషనర్
- గత కమిషనర్ పేరుతో ఎక్సైజ్ అధికారులకు లెటర్ అందించిన మద్యం వ్యాపారులు

చండూరు : ఓ మద్యం వ్యాపారి ఏకంగా అధికారులను బురిడీ కొట్టించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాన్ని చండూరు మున్సిపాలిటీకి చెందిన మడిగెలో ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే మున్సిపల్ మడిగెల్లో వైన్స్‌షాపు ఏర్పాటుచేశారు. ప్రభుత్వం రెండు నెలల క్రితం నిర్వహించిన మద్యం టెండర్లలో ఓ మద్యం దుకాణాన్ని చండూరులో కొందరు వ్యాపారులు దక్కించుకున్నారు. ఆ దుకాణాన్ని మంగళవారం మున్సిపల్ మడిగెలో ప్రారంభించారు. దుకాణాన్ని మున్సిపల్ మడిగెలో అనుమతులు లేకుండా ఎలా ఏర్పాటు చేశారని ఓ కౌన్సిలర్.. ఎక్సైజ్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మడిగెను ఖాళీ చేయాలని మద్యం వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు

గతంలో అనుమతులు

చండూరు మున్సిపాలిటీలో రోడ్డు వెడల్పులో భాగంగా ఓ వైన్స్‌షాపును ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో ఆ వైన్స్‌షాప్ యాజమానులు తాత్కాలికంగా 11, 12, 21 మున్సిపల్ మడిగెలు అద్దెకు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానం చేసి అనుమతుల కోసం కలెక్టర్‌కు సిఫారసు చేశారు. కలెక్టర్ అనుమతుల అనంతరం మున్సిపల్ అధికారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ వరకు ఒక్కో మడిగెకు రూ.6700 చొప్పున మొత్తంగా రూ.20,100 నిర్ధారించి 12.09.2023 న ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆ నాలుగు నెలలు మడిగెల్లో వైన్స్‌షాపు నిర్వహించారు.



గతంలో పనిచేసిన కమిషనర్ సంతకంతో లెటర్

నూతనంగా కేటాయించిన మద్యం దుకాణానికి మడిగెలు అందుబాటులో లేకపోవడంతో ఇదే మడిగెల్లో నిర్వహిస్తున్నట్లు గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ సంతకంతో కూడిన లెటర్‌ను ఎక్సైజ్ అధికారులకు మద్యం వ్యాపారులు అందించారు. నమ్మిన అధికారులు తాత్కాలిక అనుమతులు జారీ చేశారు. దీంతో మున్సిపల్ మడిగెలో మద్యం దుకాణాన్ని ప్రారంభించారు.

మున్సిపాలిటీ తీర్మానం చేస్తేనే..

మద్యం దుకాణానికి మున్సిపల్ మడిగెను అద్దెకు ఇవ్వాలంటే పాలకవర్గం తీర్మానం చేసి ఆ తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపాలి. కలెక్టర్ అనుమతిస్తే స్థానిక మున్సిపల్ అధికారులు మున్సిపల్ మడిగెల్లో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇస్తారు.



ఆ లెటర్ ఎక్కడిది....

నూతన షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులకు అందజేసిన లెటర్ ఎక్కడిది, ఎవరు ఇచ్చారనేది పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఇచ్చిన లెటర్‌లో ఉత్తర్వుల నంబర్‌తో పాటుగా పాలకవర్గం తీర్మానం చేసి కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది. ప్రస్తుత లెటర్‌లో ఉత్తర్వుల సంఖ్య, తేదీ కూడా పొందుపర్చలేదు. ఇదేకాకుండా మున్సిపల్ కమిషనర్ చేసిన సంతకం బ్లూ పెన్‌తో ఉంది. కమిషనర్ సంతకం పోర్జరీనా, లేక నిజమైనదా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది.

తాత్కాలిక అనుమతులు ఇచ్చాం

మున్సిపల్ తీర్మానం లేకుండా ఎక్సైజ్ అధికారులకు లెటర్ ఇచ్చినట్లు మంగళవారం నా దృష్టికి వచ్చింది. తాత్కాలిక అనుమతులు మాత్రమే ఇచ్చాం. ఇచ్చిన లెటర్ వాస్తవమా లేదా అనేది విచారణ చేస్తున్నాం. అవాస్తవమని తేలితే షాపు సీజ్ చేస్తాం.

– మల్లయ్య, ఎక్సైజ్ సీఐ

నవంబర్ వరకే తీర్మానం చేశాం

ప్రస్తుతం మున్సిపల్ మడిగెలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. పాలకవర్గం తీర్మానం చేయలేదు. గతంలో నవంబర్ వరకు మడిగెలు ఇస్తున్నట్లు తీర్మానం చేసి, కలెక్టర్ ఆదేశాల మేరకే మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చాం. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. ఇప్పటికే మడిగె ఖాళీ చేయాలని మద్యం వ్యాపారులకు సూచించాం.

– మణికరణ్, మున్సిపల్ కమిషనర్

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా

నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళా మేళా ప్రజలను ఆకట్టుకుంటోంది. పోచంపల్లి, నారాయణపేట్, పుప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగళూరు సిల్కు, కాటన్, గుజరాతీ డిజైన్ టాప్స్, డోర్ కర్టెన్స్, బెడ్ షీట్స్, రాజస్థానీ, జైపూర్, ఖాదీషర్ట్స్, సారంగపూర్ ఉడ్ ఐటమ్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ నెల 17 వరకు హస్తకళా ప్రదర్శన నిర్వహిస్తామని నిర్వాహకుడు సింహాద్రి తెలిపారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ



చెక్కతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చేనేత చీరలు



కొనుగోలు చేస్తున్న ప్రజలు



మహిళల అలంకరణ వస్తువులు



గ్రామ్‌ఫోన్



చెక్కతో తయారు చేసిన కుర్చీలు

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణలోని రైల్వే కాలనీలో గల శ్రీ సాయిదత్త ఆశ్రమంలో మంగళవారం శ్రీఅనఘాష్టమి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్ జ్యోతి వెలిగించి వ్రతాలు ప్రారంభించారు. గురుస్వామి జానకిరాముడు పర్యవేక్షణలో చేపట్టిన ఈ వ్రతాలలో పరిసర ప్రాంతాల నుంచి మహిళలు భారీగా పాల్గొన్నారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో స్థానికులు మట్టయ్య, సోమన్న, అంజిబాబు, శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.